# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇటీవల తన పదవీకి రాజీనామా చేసిన విషయం విధితమే. 2023, మేలో రెండు జాతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో దాదాపు 250 మందికిపైగా ప్రజలు మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాదు.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీలు దశల వారీగా తమ మద్దతు ఉపసంహరించుకొన్నాయి. అదీకాక.. ముఖ్యమంత్రి పదవీకి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష పార్టీలతోపాటు సొంత పార్టీ.. బీజేపీలోని ఎమ్మెల్యేలు సైతం బీరెన్ సింగ్‌పై ఒత్తిడి తీసుకు వచ్చారు. ఇక ఫిబ్రవరి 10వ తేదీన అసెంబ్లీలో సీఎం బీరెన్ సింగ్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం న్యూఢిల్లీలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం బీరెన్ సింగ్ సమావేశమయ్యారు. అదే రోజు సాయంత్రం ఆయన మణిపూర్ చేరుకుని..తాను సీఎం పదవికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

# భవిష్యత్తు అంతా ఏఐదే

- హైదరాబాద్‌తో మైక్రోసాఫ్ట్ సంస్థకు సుదీర్ఘ అనుబంధం ఉంది
- మైక్రోసాఫ్ట్ విస్తరణ ద్వారా మరిన్ని ఉద్యోగాలు
- 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్య
- 50 వేల మందికి విద్యార్థులకు శిక్షణనిస్తుంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ గచ్చీబౌలిలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కొత్త క్యాంపస్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అధునాతన ప్రమాణాలతో నిర్మించిన ఈ భవనంలో 2,500 మంది ఉద్యోగులు పనిచేయడానికి వీలుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి కొత్త భవనం ప్రారంభించగా, ఇదే సందర్భంగా మైక్రోసాఫ్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏఐ సిటీలో మైక్రోసాఫ్ట్ సరికొత్త ఏఐ సెంటర్ ను ఏర్పాటు చేస్తుంది. అలాగే, ఏఐ రంగంలో కొత్తగా రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

హైదరాబాద్ ఏఐ సిటీలో ఏఐ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 1.2 లక్షల మందికి పైగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో శిక్షణను అందించేందుకు మూడు కొత్త కార్యక్రమాలను మైక్రోసాఫ్ట్ చేపడుతుంది. అడ్వాంటేజ్ తెలంగాణ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు మైక్రోసాఫ్ట్ ఏఐ ఫౌండేషన్స్ అకాడమీ ప్రారంభిస్తుంది. దీని ద్వారా దాదాపు 50 వేల మందికి విద్యార్థులకు శిక్షణనిస్తుంది.

ఏఐ - ఇండస్ట్రీ ప్రో పేరుతో మరో కార్యక్రమాన్ని చేపడుతుంది. రాష్ట్రమంతటా 20,000 మంది పరిశ్రమల నిపుణులకు నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణనిస్తుంది. ఏఐ సీఓఈ ని ఏర్పాటు చేసి ఏఐ-గవర్న్ ఇనిషియేటివ్ పేరుతో రాష్ట్రంలోని దాదాపు 50 వేల మంది ప్రభుత్వ అధికారులకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ప్రొడక్టివిటీ వంటి కీలకమైన రంగాలలో శిక్షణ ఇస్తుంది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్లలో తన పెట్టుబడులను రెట్టింపు చేస్తామని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. రాబోయే సంవత్సరాల్లో వీటికి అదనంగా రూ. 15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది.

భవిష్యత్తు అంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వైపు పయనిస్తున్న సందర్భంలో హైదరాబాద్ లో మైక్రోసాఫ్ట్ కొత్త ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం అందరికీ గర్వకారణమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిఅన్నారు. ఈ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించడమే కాకుండా మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల గత జనవరిలో హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి జరిపిన చర్చల ఫలితంగా తాజా ఎంఓయూ కుదిరింది. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీ మరియు క్లౌడ్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి, ఏఐ ద్వారా సేవలను విస్తృతం చేయడంలో మైక్రోసాఫ్ట్ పనిచేస్తుంది.

"మైక్రోసాఫ్ట్‌కు నాయకత్వానికి అభినందనలు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌కు మధ్య విడదీయలేని సుదీర్ఘ అనుబంధం ఉంది. హైదరాబాద్‌లో కొత్త ఫెసిలిటీని ప్రారంభించడం మనందరికీ గర్వకారణం. హైదరాబాద్‌తో కలిసి చేస్తున్న ప్రయాణంలో ఇదొక మైలురాయిగా నిలుస్తుంది. హైదరాబాద్ నేడు ప్రపంచంలోనే టెక్నాలజీ పవర్ హౌస్‌గా, సరికొత్త ఆవిష్కరణలకు, ప్రపంచ ప్రతిభను ఆకర్షించే నగరంగా మారింది.

మిగితా 2వ పేజీలో

## గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ తో ఒప్పందం చేసుకుంది. ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలను విస్తృతం చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం గూగుల్ సంస్థ అందించనుంది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గూగుల్ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, గూగుల్ ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం గూగుల్ రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్

మిగితా 2వ పేజీలో

## పార్లమెంట్‌లో నూతన ఆదాయపు పన్ను బిల్లు

- విపక్షాల నిరసనల మధ్య బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం నూతన ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ విపక్షాలు లోక్‌సభ నుండి వాకౌట్ చేశాయి. ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. ఇందులో భాగంగా ఆదాయపు పన్ను నూతన బిల్లు-2025ను పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. విపక్షాల నిరసనల మధ్య నిర్మలా సీతారామన్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీంతో విపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. ఆ తర్వాత కాసేపటికి లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది.

## అప్పుల్లో కూరుకుపోతున్న తెలంగాణ

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అప్పుల్లో కూరుకు పోయిన విషయం వాస్తవమని, ఎన్ని చర్యలు చేపట్టినా అప్పుల్లో కూరుకుపోతోందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇస్తుందనడం సరికాదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఏ రాష్ట్రంపై వివక్ష చూపట్లేదని తెలిపారు. బడ్జెట్‌లో ఏ ఒక్క రాష్ట్రానికి పెద్దపీట వేయట్లేదని తెలిపారు. బడ్జెట్‌కు ముందు అన్ని రాష్ట్రాలను సంప్రదిస్తున్నామని రాజ్యసభలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సభ్యులకు వివరణ ఇచ్చారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సుదీర్ఘంగా చర్చిస్తున్నామని, పీఎం గతిశక్తి ద్వారా రాష్ట్రాల మధ్య అసమానతల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇస్తున్నామనడం సరికాదన్న నిర్మలా సీతారామన్, తన ప్రసంగాన్ని అడ్డుకున్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలను ఉద్దేశించి లెక్క లతో సహా తెలంగాణకు నిధుల కేటాయింపులను ఈ సందర్భంగా వివరించారు. విభజన హామీల కింద తెలంగాణలో వెనుకబడిన 9 జిల్లాలకు రూ.2,700 కోట్లు ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ మెదక్ నుంచి ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. అయినా కూడా మెదక్ జిల్లాలో మొదటి రైల్వేస్టేషన్‌ను మోదీ సర్కారే ఇచ్చిందన్నారు.

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను, ప్రయోజనాలను రాజ్యసభలో లెక్కలతో సహా వెల్లడించారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ, నిజామాబాద్‌లో పసుపు బోర్డు, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మెదక్ జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ నోడల్ పాయింట్, ములుగులో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ, బీబీనగర్‌లో ఎయిమ్స్ ఆసుపత్రి లాంటివి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2014 నుంచి తెలంగాణలో 2,605 కిలో మీటర్ల మేర హైవేల నిర్మాణం చేపట్టామన్నారు. భారత్‌మాల కింద 4 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు నిర్మించామని, ఈ ఏడాది తెలంగాణలో రైల్వేకు రూ.5,337 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎర్రుపాలెం-నంబూరు, మల్కన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైల్వేలైన్లు మంజూరుతో సహా, తెలంగాణకు ఐదు వందేభారత్ రైళ్లు ఇచ్చామన్నారు. 2014 నుంచి 753 కిలో మీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించినట్లు తెలిపారు.

## మరో 7 ఫ్లై ఓవర్లకు ఆమోదం..



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ అయిన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపలి ఏరియా మొత్తాన్నీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు, నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన డ్రోన్ సర్వేను కోర్ అర్బన్ ఏరియా అంతటా నిర్వహించాలన్నారు.

నానక్‌రామ్‌గూడలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో కోర్ అర్బన్ అభివృద్ధి అంశాలను ముఖ్యమంత్రి సమీక్షించారు. నగరంలో కొత్తగా మరో 7 ఫ్లైఓవర్లు నిర్మించాలన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి అంతరాయం లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా హైదరాబాద్ నగరంలో గృహాలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, మురుగునీటి వ్యవస్థకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించాలి. గ్రేటర్ హైదరాబాద్ లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైతే గూగుల్ సాంకేతిక సహకారాన్ని తీసుకుని వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

కోర్ అర్బన్ ప్రాంతంలో చెరువుల పునరుద్ధరణ, నాలాల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలి. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధానమైన మరో 7 కూడళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా భూసేకరణ, ఇతర పనులను పూర్తి చేసి, వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలి అన్నారు. ఈ సమావేశంలో మౌలిక సదుపాయాల సలహాదారు శ్రీనివాసరాజు , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ గారు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలాంబర్తి గారు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గురుకులాల మరమ్మతులకు నిధులు కేటాయిస్తాం



**మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో అవసరమైన మరమ్మతులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులు వెంటనే కేటాయిస్తామన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల అద్దె బకాయిలు వెనువెంటనే చెల్లించేలా ప్రతిపాదనలు తీసుకురావాలని స్పష్టంచేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి పొన్నంతో కలిసి బిసి సంక్షేమం రవాణా శాఖలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉచిత బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ స్టడీ సెంటర్లు.. ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని భట్టి ఆదేశించారు. టీజీపీఎస్సీ జాబ్ క్యాలెండర్‌ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలన్నారు. డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షలపై కూడా దృష్టి సారించాలని ఆదేశించారు. గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశం పెట్టడం మూలంగా ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఇక ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలు, వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పాటు.. ఆర్టీసీ ఆస్తులు, నిర్వహణ, ఆదాయ వనరులపై సమావేశంలో చర్చించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 90 మంది

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాలలో నామినేషన్ల ఉపసంహారణ గడువు తేదీ గురువారంతో ముగిసింది. దీంతో మొత్తం కరీంనగర్ (గ్రాడ్యుయేట్, టీచర్), నల్లగొండ టీచర్ నియోజక వర్గాల నుంచి మొత్తం 90 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలంగాణ సీఈవో సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. అలాగే కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 68 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఉండగా.. వారిలో 12 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో ఆ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం 56 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అలాగే కరీంనగర్ టీచర్ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు అర్హత సాధించగా.. వారిలో ఒక్కరు తమ నామినేషన్ వెనక్కి తీసుకోవడంతో 15 మంది బరిలో ఉన్నారు. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజక వర్గం నుంచి 21 మంది అభ్యర్థులకు అర్హులుగా పరిగణించగా.. వారిలో 3 నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 19 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నట్లు సీఈవో పేర్కొన్నారు.

## ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం చేయాలి

- వైమానిక రంగానికి ప్రోత్సాహం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ముందస్తు బడ్జెట్ సమీక్ష చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు డీపీఆర్ త్రిడీ డిజైన్లు వంటి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని, నిధుల కొరత లేదని డిప్యూటీ సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించాలనీ, పెద్ద సంఖ్యలో ఉన్న విలువైన ఈ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు అన్ని స్థాయిల్లో చర్యలు చేపట్టాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. హైబ్రిడ్ యాన్యూటీ హెడ్ (హమ్) రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వచ్చే రహదారులు పూర్తిస్థాయిలో అభివద్ధి చేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు చేపట్టి నిధులు సద్వినియోగం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. గత పదేండ్లుగా పాలించిన వారు ఈ చట్టాన్ని నిర్లక్ష్యం చేశారని గుర్తుచేశారు. తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చట్టం నిధుల మేరకు స్థానికంగా

మిగితా 2వ పేజీలో

## పింక్ బుక్ మెయింటేన్ చేస్తాం



- శేంతకింతకు తిరిగి చెల్లిస్తాం
- సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెడితేనే ముఖ్యమంత్రి భయపడుతున్నారు
- ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తమ పార్టీ నాయకులను అధికార కాంగ్రెస్ పార్టీ వేధిస్తోందని, తాము కూడా పింక్ బుక్ మెయింటెన్ చేస్తామని, తిరిగి చెల్లిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఎక్స్‌లో ఎవరైనా కామెంట్ పెట్టినా, ఫేస్‌బుక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ పెట్టినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని ఆమె విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్ చేస్తే చాలు పోలీసులు ఇంటికి వచ్చి అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ తన జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకొని తిరుగుతున్నారని, ఇక్కడ రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని ఆమె విమర్శించారు. వేధింపులకు సంబంధించి లెక్కలు ఎలా రాయాలో, ఉద్యమాలు ఎలా చేయాలో తమకు

మిగితా 2వ పేజీలో

## గులబీ బాస్ ఇజ్ బ్యాక్..!

- కేసీఆర్ అధ్యక్షతన 19న బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం
- సిల్వర్ జూబ్లీ వేడుక, పార్టీ సభ్యత్వ నమోదు, ప్రభుత్వ వైఫల్యాలపై భేటీలో చర్చించే అవకాశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రజల్లోకి రానున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొన్నాళ్లు సమయం ఇవ్వాలని రాజకీయాలకు దూరంగా ఉన్న కేసీఆర్ ఇప్పుడు మళ్లీ రంగంలోకి దిగనున్నారు. బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. ఈనెల 19వ తేదీన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆదేశించారు.

అధినేత ఆదేశాల మేరకు.. ఈనెల 19 వ తేదీన మధ్యాహ్నం 1 గంట నుండి హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది. అధినేత కేసీఆర్ గారి అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులు... పార్టీ నియోజకవర్గ ఇంచార్జీలతో కూడిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నామని కేటీఆర్ తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చ జరగన్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనున్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటీఆర్ తెలిపారు.

# క్షయ రహిత తెలంగాణే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలు .
- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని తన నివాసంలో నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో 8 ఫార్మా కంపెనీలు క్షయ బాధితులకు 2 కోట్ల 80 లక్షల రూపాయల విలువైన ఫుడ్ బాస్కెట్ (కిట్స్) ను తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చికిత్స కాలం పూర్తి అయ్యేవరకు ప్రతి నెల న్యూట్రిషన్ కిట్స్ ను అందిస్తున్నందుకు మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా క్షయ బాధితులకు అండగా నిలిచి న్యూట్రిషన్ ఫుడ్ ను అందిస్తున్న కార్పొరేట్ ఫార్మా కంపెనీలైనా ఆరాజన్ ఫౌండేషన్, ఆప్టిమస్ డ్రగ్స్, బయోలాజికల్ - ఈ, గ్లాండ్ ఫార్మా, మెట్రో కెమ్, నాట్కో ఫార్మా, గ్రాన్యూల్స్, సన్ ఫార్మాసిటికల్ కంపెనీల ప్రతినిధులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ తన నివాసంలో ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో క్షయ నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు క్షయ వ్యాధి నిర్మూలన లో భాగంగా రాష్ట్రంలో అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలలో (9 జిల్లాలలో) 100 రోజులపాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ఉదృతంగా నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన, యాక్టివ్నెస్ ఫైండింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. క్షయ రహిత తెలంగాణ లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నమన్నారు. క్షయ వ్యాధి విస్తరించకుండా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం స్క్రీనింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. క్షయ వ్యాధి బారిన పడిన బాధితుల చికిత్స కాలంలో 8 ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులతో న్యూట్రిషన్ కిట్స్ ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు, ప్రతినెల చికిత్స కోసం వెయ్యి రూపాయల నగదును అందిస్తున్నామన్నారు. వంద రోజుల పాటు క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ప్రభుత్వం నిర్దేశించిన 9 జిల్లాలలో ఉధృతంగా కొనసాగిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి బాధితులకు అండగా నిలిచి సాయం అందిస్తున్న 8 ఫార్మా కంపెనీల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్, డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ కమల్ హాసన్ రెడ్డి, టీబీ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ డా. రాజేశం, డ్రగ్స్ కంట్రోల్ డిప్యూటీ డైరెక్టర్ రామ్ దాన్, డాక్టర్ శ్రీగణ, డా. మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీతో ఎలాన్ మస్క్ భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం పలువురు ప్రముఖులతో వరుసగా భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే.. ప్రధాని మోదీ .. ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు.. ఈ బేటిలో మస్క్ తోపాటు ఆయన భార్య, ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ప్రధాని మోదీ బస చేసిన బ్లెయిర్ హౌస్‌లో ఇరువురు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. ఎలాన్ మస్క్ భారత్‌లో టెస్లా ఎంట్రీ, స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై చర్చించినట్లు సమాచారం.. అంతకుముందు అమెరికా జాతీయ భద్రత సలహాదారు మైక్ వాల్జ్‌తో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఎన్ఎస్ఏతో ఫలవంతమైన సమావేశం జరిగిందని.. మైఖేల్‌వాల్జ్ ఎల్లప్పుడూ భారతదేశానికి గొప్ప స్నేహితుడంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. రక్షణ, సాంకేతికత, భద్రత.. భారతదేశం-యుఎస్ఎ సంబంధాలలో ముఖ్యమైన ఈ అంశాలపై తాము అద్భుతమైన చర్చలు జరిపామన్నారు. ఏఐ, సెమీకండక్టర్లు, అంతరిక్షం, మరిన్ని రంగాలలో సహకారానికి బలమైన అవకాశం ఉందని ప్రధాని ఎక్స్ లో షేర్ చేశారు. కాగా.. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 2.30 సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ కానున్నారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి భేటీ కానున్నారు. మరోవైపు.. సుంకాల విషయంలో ట్రంప్ కీలక ప్రకటన చేసిన సమయంలో ఇరువురు భేటీపై ఉత్కంఠ నెలకొంది..

## 'ఫామ్‌హౌస్‌లో జరిగిన ఘటనలో నాకు సంబంధం లేదు'

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తొల్కట్టలో జరిగిన ఘటనకు, తనకు సంబంధం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం మొయినాబాద్ పోలీసులు నోటీసులిచ్చినందున పూర్తిస్థాయిలో పోలీసులకు సహకరిస్తానని తెలిపారు. కాగా, ఫామ్‌హౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి భారీ ఎత్తున నిర్వహించిన కోడి పందేల వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం 61 మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి రూ.30లక్షల నగదు, క్యాసినోలో ఉపయోగించే రూ.కోటి విలువైన బెట్టింగ్ కాయిన్లతో పాటు 50 కార్లు, 80 పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది వ్యాపారులే. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఆయన ప్రకటన విడుదల చేశారు. 2018లో కొనుగోలు చేసిన భూమికి సంబంధించి అన్ని వ్యవహారాలు తన మేనల్లుడు జ్ఞాన్‌దేవ్‌రెడ్డి చూసుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఫామ్‌హౌస్ లేదని, కేవలం మామిడి, కొబ్బరి తోట ఉందని, అక్కడ పనిచేసే వారి కోసం రెండు గదులు ఉన్నాయని తెలిపారు. తోటను తన ప్రమేయం లేకుండా మేనేల్లుడు.. వర్రా రమేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్టు ఈ ఘటన తర్వాత తెలిసిందన్నారు. వర్రా రమేశ్ అనే వ్యక్తి ఆ తోటను మరో వ్యక్తి ఎం. వెంకటపతి రాజుకు కౌలుకు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ఘటన గురించి తెలిసి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తానే ఫిర్యాదు చేశానని తెలిపారు. ఘటన జరిగిన రోజు తాను వరంగల్‌లో ఎల్లమ్మ పండుగలో ఉన్నానని చెప్పారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టడానికి కొందరు తనపై దుష్పచారం చేస్తున్నారని అన్నారు. 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఒక్క చిన్న కేసు లేకుండా ప్రజాసేవకే అంకితమయ్యాయని, చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనని తెలిపారు. తాను భూమి యజమాని కావున తనకు పోలీసులు నోటీసులు ఇచ్చారని, పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని తెలిపారు.

## భవిష్యత్తు అంతా ఏఐదే

(మొదటి పేజీ తరువాయి)

మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉంటుంది. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ నాయకత్వానికి ధన్యవాదాలు. మైక్రోసాఫ్ట్ నిబద్ధత తెలంగాణ రైజింగ్ విజన్‌కు తోడవుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు గారితో పాటు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ గారు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ గారు, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ గారు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచుకుంటుంది. రైతులకు అవసరమైన ఇన్పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ ను ప్రారంభిస్తుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్ ను అందిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "ఏఐ ఆధారిత రంగాల్లో గ్లోబల్ లీడర్ గా ఉండాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు గూగుల్ సహకారం ఎంతగానే ఉపయోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది" అని అన్నారు.

గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని అన్నారు.

## ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పనులు చేపడుతున్న విషయాన్ని ఆ ప్రాంత నేతలు, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ శాఖ అధికారులపై ఉందన్నారు. కొత్త ఎయిర్ పోర్టుల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకష్ణారావు, వికాస్‌రాజ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కష్ణభాస్కర్, కార్యదర్శి దాసరి హరిచందన, ఆర్థిక శాఖ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రజల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, కృష్ణా జలాల విషయమై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణకు అన్యాయం జరగనివ్వం అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల కేటాయింపు వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాఖలు చేసిన పిటిషన్ WP 1230/2023 నేడు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిన నేపథ్యంలో మంత్రి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, న్యాయ వాదులతో కలిసి విచారణకు స్వయంగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోర్టు విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసిందని, ఈ నెల 25వ తేదీ కల్లా అన్ని వాదనలపై షార్ట్ నోట్స్ సమర్పించాలన్నారని అన్నారు. కావున ఈ నెల 19-21వరకు జరగాల్సిన బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ యధాతథంగా ఉంటుందని ఆయన తెలిపారు. నేటి సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వం వాదనలకు మద్దతుగా నిలిచిందని, ఇది రాష్ట్ర హక్కులను రక్షించడంలో ముందడుగు అనిమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నేటి విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, ఆదిత్యనాథ్ దాస్ (ప్రభుత్వ సలహాదారు), వైద్యనాథన్, గోపాల్ శంకర్ నారాయణ (న్యాయవాదులు), అంతర్రాష్ట్ర నీటి వనరుల విభాగం అధికారులు, ENC (O&M) హాజరయ్యారు.

**వక్ఫ్ సవరణ బిల్లు-2024పై అధ్యయనం జరిపిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బీజేపీ ఎంపీ సంజయ్ తదితరులు ముసాయిదా బిల్లుపై తమ నివేది కను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారని నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ విపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. విపక్షాల నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది.**

## పింక్ బుక్ మెయింటేన్ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

జయశంకర్ సార్ నేర్పించారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. కార్యకర్తలందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి, కేంద్రానికి పంపించి చేతులు దులుపుకుందని కవిత ఆరోపించారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా, మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు, ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును తీసుకు రావాలని కోరారు. బిల్లు పెట్టిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయని ఆమె అన్నారు. జాప్యం చేసి ఇతరులు కోర్టులకు వెళ్లే అవకాశం ఇవ్వవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ ఉద్యమాలతో దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడతామని ప్రకటించిందని గుర్తు చేశారు. ఇది బీసీలందరి విజయమని ఆమె వ్యాఖ్యానించారు. కుల గణనకు మరోసారి అవకాశం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఇందుకు నెల రోజుల సమయం ఇవ్వాలని ఆమె సూచించారు.




## పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలి..

### -డీపీఓ, నోడల్ అధికారి శేషాద్రి

**బలగం టీవీ , సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని డీపీఓ, నోడల్ అధికారి శేషాద్రి అన్నారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు . ఈ సందర్భంగా డీపీఓ, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడుతూ ఎన్నికల నియమ, నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్ (కర దీపిక) ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని అన్నారు . సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఆర్ఓ లు 194, మంది ఏ ఆర్ఓలు 75 మంది , ఎంపీడీవోలు, ఎంపీఓలు శిక్షణకు హాజరయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికల కోసం జిల్లాలో మొత్తం 2268 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. శిక్షణ తరగతుల్లో డీఎల్ పీఓ నరేష్, మాస్టర్ ట్రెయినర్లు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించండి...



### -జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్.

**బలగం టీవీ , సిరిసిల్ల**

పెండింగ్ లో ఉన్నా పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించి,అనంతరం వినతి పత్రం అందించిరు. ఈ సందర్భంగా జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పాలడుగు సుధాకర్, జీపీ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసిన, రాజన్న సిరిసిల్ల జిల్లా లోని కార్మికుల వేతనాలు మాత్రం గత జూలై నుండి పెండింగ్లో ఉన్నాయని అన్నారు.గత 15 రోజులక్రితం రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పెండింగ్ వేతనాల కోసం నిధులు విడుదల చేసిన కేవలం డిసెంబర్ నెల వేతనాలు మాత్రమే కార్మికులకు అందించారని అన్నారు.జూలై నుండి నవంబర్ వరకు వేతనాలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని,పంచాయతీ కార్యదర్శులను అడిగితే మేము చెక్కులు వేశాంమని, ఎస్ టీ వో లో ఆగుతున్నాయని చెబుతున్నారని, ఎస్ టీ వో లో అడిగితే మేము చెక్కులు క్లియర్ చేసామని ,టోకెన్ నంబర్ కూడా ఇచ్చాం,మా దగ్గర పెండింగ్ లో లేవు అంటున్నారని అన్నారు.మండల పరిషత్ అధికారులను అడిగిన నిధులు లేవు అంటున్నారని,జిల్లా ఇంచార్జ్ పంచాయతీ అధికారిని అడిగితే జిల్లాలో ఎక్కడ వేతనాలు పెండింగ్ లో లేవు అంటున్నారని అన్నారు.కార్మికులకు మాత్రం గత జూలై నుండి నవంబర్ వరకు పెండింగ్ లో ఉన్నాయని,రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో కూడా నిధులు పెండింగ్ లో లేవు, ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లా లోనే వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెల నుండి గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా మొదటి తేదీన వేతనాలు అందిస్తామని అన్నారని, 13 వ తేదీ వచ్చిన ఇంకా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు పడలేదని అన్నారు.కలెక్టర్ కార్మికుల సమస్యలపై స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు ప్రతినెలా సబ్బులు , నూనెలు మరియు రక్షణ పరికరాలు తక్షణమే అందించాలని కార్మికుల వేతనాలపై పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, లోకిని శ్రీనివాస్, నారపురం నర్సయ్య, అక్కల అంజయ్య గౌడ్ , సందెల మహేష్ , రాజశేఖర్, అనిల్ కార్మికులు పాల్గొన్నారు

## అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### -నరేందర్ రెడ్డి ను భారీ మెజారిటీతో గెలిపించాలి..

### - ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



**బలగం టీవీ , వేములవాడ**

ఎమ్మెల్యే ఎన్నికల్లో తన గెలుపులో ఏ విదంగా భాగస్వామ్యులు అయ్యారో అదేవిదంగా, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకోసం ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేముల వాడ పట్టణంలోనీ దువ్వాస్ బాంక్విట్ హాల్ లో మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వేములవాడ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డా.వూట్కూరి నరేందర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.పది సంవత్సరాల్లో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో సంవత్సర కాలంలో జరిగిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డిఎస్సీ జరిగింది,మళ్లీ గత పదేళ్లుగా డిఎస్సీ వేయలేదు,మళ్ళీ కాంగ్రెస్ వచ్చాక డిఎస్సీ వేశాము అని అన్నారు.బీఆర్ ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల లో 55 వేళ ఉద్యోగలు ఇవ్వలేదు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పది నెలల్లో 55 వేళ ఉద్యోగాలు ఇచ్చాము అని అన్నారు.మా ప్రభుత్వం కి ప్రతిపక్ష మాజీ సర్పంచ్ లు,ఎంపిటిసి లు కృతజ్ఞతలు చెబుతున్నారని,

ఎమ్మెల్సీ ఎన్నికలు అయిపోగానే రాష్ట్రంలో జడ్పీటీసీ ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్గా భావించి రాబోయే సర్పంచ్ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఫైనల్ గా భావించాలని అన్నారు. ఎన్నికల్లో గ్రామాల్లోని పట్టభద్రులను ప్రసన్నం చేసుకొని ఎమ్మెల్సీ గెలుపు కోసం తోడ్పాటు అందిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఈజీగా ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం లో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్మెంట్ కింద పది కోట్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విద్యాసంస్థల ద్వారా ఎంతమందికి సేవ చేస్తున్నారని, చాలామంది పేద ప్రజలకు పాఠశాల కళాశాలలో ఫీజుల విషయంలో రాయితీ కల్పించారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బట్టి పరిపాలన కొనసాగుతుందని,ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసిఆర్ కి దక్కిందని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రతిరోజు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని,రైతు భరోసా పై అపోహలు సృష్టించారు, కానీ నిన్నటి వరకే మూడు ఎకరాల వరకు పడ్డాయి, మిగతావి త్వరలోనే అర్హులైన వారికి రైతు భరోసా వస్తుందని అన్నారు. వాగులో వంకలు రియల్ ఎస్టేట్ వెంచర్ల కాకుండా నిజమైన రైతులకు రైతు భరోసా అందజేస్తామని,

వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేముల వాడకు రావడం జరిగిందని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో పడవబడ్డ ప్రాజెక్టులను నేడు ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని,వేములవాడ పట్టణంలోని మూడో బ్రిడ్జి నిర్మాణం టెండర్లు పూర్తయి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు,35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం,గుడి చెరువు, మూల వాగులో మురికి నీరు కలవకుండా కాలువల నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. కలికోట సూరమ్మ చెరువు, మరి పెళ్లి చెరువు రిజర్వాయర్, లచ్చపేట తండా కాలువ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందజేయడమే లక్ష్యంగా నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. వేములవాడ ప్రాంతమును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని, కార్యకర్తలు కష్టపడండి,మీకు నేను అండగా ఉంటానని అన్నారు. రైతులకు వేసవికాలం రాకముందే సాగునీరు అందించాలని, రైతులు రోడ్ ఎక్కకముందే నీరు విడుదల చేయడం జరిగిందని, దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతున్నామని అన్నారు.

వేములవాడ పట్టణ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం లక్ష్యంగా పనిచేయాలని, నియోజకవర్గ పరిధిలోని అన్ని ఎంపీపీ,జడ్పిటిసి ఎంపిటిసి స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని అన్నారు.

## సంత్ రవిదాస్ సందేశం సమాజంలో సమానత్వాన్ని పెంపొందించడమే

**బలగం టీవీ , హైదరాబాద్**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ ముఖేష్ కుమార్ మాట్లాడారు. "సంత్ రవిదాస్ జీ సమాజ సేవకుడు, హిందూ ధర్మ పరిరక్షకుడు. ఆయన జీవితాంతం సామాజిక సమానత్వం, అస్పృశ్యత నిర్మూలన కోసం కృషి చేశారు. మత మార్పిడులను ఎదుర్కొని, హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు పాటుపడ్డారు. ఆయన సందేశం సమాజంలో సమానత్వాన్ని పెంపొందించడమే. సంత్ రవిదాస్ జీవితం, ఆయన బోధనలు భారతీయ సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం సంత్ రవిదాస్ జీ గౌరవార్థం, ఆయనను స్మరించుకునేలా సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో శ్రీ సంత్ రవిదాస్ మహారాజ్ 648 జయంతి వేడుకలని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తోంది. భారతీయ సంస్కృతిని, మహనీయుల సేవలను గౌరవించేలా కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతీయ సంస్కృతిని, మహనీయుల సేవలను గౌరవించే విధంగా దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మోదీ ప్రభుత్వం మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో చేపట్టిన సంత్ రవిదాస్ స్మారక మందిర నిర్మాణం.. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలవబోతోంది. భవిష్యత్తు తరాలకు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారనుంది.

బీజేపీతోనే సంస్కృతిని పరిరక్షించుకునేలా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు జన్ ధన్ ఖాతాలు, విశ్వకర్మ యోజన, ఉపాధి అవకాశాల కల్పన వంటి పథకాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తోంది.జనధన్ యోజన ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వావలంబన లభించింది.విశ్వకర్మ యోజన ద్వారా వివిధ కులవృత్తుల వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించుకుంటున్నాం.బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన సంత్ రవిదాస్ వారోత్సవాలు నిర్వహించుకుంటున్నాం.రానున్న 6 రోజుల పాటు ప్రతి జిల్లా, మండల స్థాయిలో ఆయన బోధనలను ప్రచారం చేయనున్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన మోచీ సమాజం ప్రత్యేకంగా సంత్ రవిదాస్ మహారాజ్ సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకల సందర్భంగా వారోత్సవాల్లో పాల్గొంటున్నారు.



## మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి...

**బలగం టీవీ , సిరిసిల్ల**

ఉమ్మడి కరీంనగర్ మెదక్ నిజామాబాద్ అదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు లో మరియు బార్ అసోసియేషన్ లో ఓట్లు అభ్యర్థించారు.ఇక్కడ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అన్నల్ దాస్ వేణు,జిల్లా కన్వీనర్ వరద మారుతి, న్యాయవాదులు కోడి లక్ష్మణ్, సంగీతం సాయిరాం, కైలాష్, మోగిలి రాజు,కైలాష్,గణేష్,వెంకటయ్య,శరత్ రెడ్డి, సంతోష్ రెడ్డి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు

## క్షమాపణలు చెప్పిన పృథ్వీ

**బలగం టీవీ , హైదరాబాద్**

లైలా' సినిమా ప్రీ–రిలీజ్ వేడుకలో చేసిన వ్యాఖ్యల పట్ల సినీ కమెడియన్ పృథ్వీ క్షమాపణలు చెప్పారు. ఈ సినిమా వేడుకలో తాను చేసిన వ్యాఖ్యల ద్వారా ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. తనకు ఎవరి పైనా కక్ష, ద్వేషం లేదని ఆయన స్పష్టం చేశారు. తన వల్ల సినిమాకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతోనే క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. 'బాయ్‌కాట్' లైలా అని కాకుండా 'వెల్‌కం' లైలా అని ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ఫలక్‌నుమాదాస్ కంటే 'లైలా' సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# మహిళా ఐపీఎల్‌కు వేళాయే..




- నేటి నుంచి డబ్ల్యూపీఎల్ 2025
- పోటీలో 5 జట్లు
- వడోదర వేదికగా తొలి మ్యాచ్
- ఆర్సీబీ వర్సెస్ గుజరాత్ జెయింట్స్

**బలగం టీవి, హైదరాబాద్**

మహిళా ఐపీఎల్ డబ్ల్యూపీఎల్ మూడో ఎడిషన్ శుక్రవారం ఘనంగా ప్రారంభం కానుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, ఉత్తరప్రదేశ్ వారియర్స్, ముంబై ఇండియన్స్ జట్లు పోటీపడుతున్నాయి.

వడోదరలో జరిగే తొలి మ్యాచ్‌లో ప్రస్తుత ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ తలపడతాయి. ఈ ఏడాది మహిళా ఐపీఎల్ వడోదర, బెంగళూరు, లక్నో, ముంబై నగరాల్లో జరుగుతుంది. ఢిల్లీలో మ్యాచ్‌లు నిర్వహించడం లేదు.

డబ్ల్యూపీఎల్‌లో మొత్తం ఐదు జట్లు డబుల్ రాబిన్ ఫార్మాట్‌లో తలపడనున్నాయి. లీగ్ దశలో ప్రతీ జట్టు తమ ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడుతాయి. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్ మ్యాచ్ ఆడనుండగా.. రెండు, మూడో స్థానంలో నిలిచిన జట్లు ఎలిమినేటర్ ఆడుతాయి. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ చేరుతోంది. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌కు జియోసినిమా, స్పోర్ట్స్ 18 నెట్ వర్క్ అధికారిక బ్రాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తున్నాయి. స్పోర్ట్స్ 18 ఛానెల్ పాటు జియోసినిమాలో ఈ మ్యాచ్‌లు ప్రత్యక్షప్రసారం కానున్నాయి. మొత్తం 8 భాషల్లో కామెంట్రీ అందుబాటులో ఉండనుంది. జియోసినిమాలో ఈ మ్యాచ్‌లను ఉచితంగా వీక్షించవచ్చు. స్పోర్ట్స్ 18 ఛానెల్‌ను మాత్రం సబ్‌స్క్రిప్షన్ చేసుకోవాల్సి ఉంటుంది

# ఆర్సీబీ కెప్టెన్‌గా రజత్ పటిదార్




**బలగం టీవి, బెంగుళూరు**

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుజట్టు తన కొత్త కెప్టెన్ ను ప్రకటించింది. ఎవరూ ఊహించని విధంగా భారత యంగ్ వికెట్ కీపర్ బ్యాట్స్ మెన్ రజత్ పటిదార్‌కు బెంగళూరు టీమ్ సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆర్సీబీ ప్రకటన చేసింది. ఆర్సీబీకి ఇప్పటి వరకు ఏడు మంది కెప్టెన్లుగా చేశారు. రజత్ పటిదార్ ఇప్పుడు ఎనిమిదో వ్యక్తి అయ్యాడు. 2008 సీజన్‌కు రాహుల్ ద్రావిడ్, 2009 సీజన్‌కు కెవిన్ పీటర్సన్, 2009–10 సీజన్‌కు అనిల్ కుంబ్లే, 2011–12 సీజన్‌కు డానియల్ వెటోరి, 2011–2023 వరకు విరాట్ కోహ్లీ, 2017 సీజన్‌లో షేన్ వాట్సన్, 2022–2024 మధ్య డూప్లిసిస్ ఆర్సీబీ కెప్టెన్లుగా చేశారు.

ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలో మధ్యప్రదేశ్ జట్టుకు సారధిగా పటిదార్ బాధ్యతలు నిర్వర్తించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ ఫైనల్ వరకు వెళ్లింది. ఫైనల్లో ఆ జట్టు ముంబై చేతిలో ఓడింది. ఆ టీ20 టోర్నీలో అత్యధిక రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 10 మ్యాచుల్లో అతను 428 స్కోర్ చేశాడు. 196 స్ట్రయిక్ రేటుతో సగటును 61 రన్స్ స్కోర్ చేశాడు. ఇదిలా ఉండగా విరాట్ ఓ వీడియో సందేశాన్ని ఇచ్చాడు. ఆ వీడియోను ఆర్సీబీ తన ట్వీట్‌లో పోస్టు చేసింది. తనతో పాటు జట్టు సభ్యులు అందరూ రజత్‌కు అండగా ఉండనున్నట్లు ఆ వీడియో సందేశంలో కోహ్లీ తెలిపాడు. నువ్వు ఎదిగిన తీరు హర్షణీయమని, అద్భుతమైన పర్ఫార్మెన్స్ ఇచ్చావని, ఆర్సీబీ అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నావని పటిదార్‌ను కోహ్లీ మెచ్చుకున్నాడు.




## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తండేల్ యూనిట్

**బలగం టీవి, హైదరాబాద్**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని 'తండేల్') చిత్రబృందం దర్శించుకుంది. గురువారం ఉదయం స్టార్ నటులు నాగచైతన్య, సాయిపల్లవి, దర్శకుడు చందూ మొండేటి, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు తదితరులు శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట

**బలగం టీవి, హైదరాబాద్**



జర్నలిస్ట్‌పై దాడి కేసులో టాలీవుడ్ సీనియర్ హీరో మంచు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో మోహన్‌బాబుకి ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది. గురువారం ఉదయం ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ సుదాంత్ దులియా ధర్మాసనం.. మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కేసు విచారణ సందర్భంగా కావాలని తాను జర్నలిస్టుపై దాడి చేయలేదని సుప్రీంకోర్టుకు మోహన్ బాబు తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నామని చెప్పారు. బాధిత జర్నలిస్టుకు నష్టపరిహారం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.




## తెలంగాణ అమ్మాయికు గోల్డ్ మెడల్

**బలగం టీవి, ఉత్తరఖండ్**

ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 38వ జాతీయ క్రీడల్లో తెలంగాణ అమ్మాయి సత్తా చాటింది. తెలంగాణ క్రీడాకారిణి నిష్కా అగర్వాల్ పసిడి పతకంతో సత్తా చాటింది. మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. తాజాగా జరిగిన టేబుల్ వాల్ట్‌లో నిష్కా అగర్వాల్ 12.717 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచి విజయం సాధించింది. ఫైనల్ లో ఎనిమిది మందితో పోటీపడి ఈ పతకాన్ని ముద్దాడింది. దీంతో ప్రస్తుతం జాతీయ క్రీడల్లో తెలంగాణకు ఇది మూడో గోల్డ్ మెడల్ కావడం విశేషం. ఇక ఇదే పోటీలో ప్రణతి నాయక్ (12.700 – ఒరిషా) సిల్వర్ మెడల్, ప్రతిష్ట సమంత (12.484– పశ్చిమ బెంగాల్) బ్రాంజ్ మెడల్ సాధించారు. మరోవైపు రెజ్లింగ్‌లో తెలంగాణకు చెందిన నిఖిల్ యాదవ్ కంచు పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. 65 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కర్ణాటక రెజ్లర్‌పై గెలిచి కాంస్య పతకాన్ని అందుకున్నాడు. మొత్తంగా బుధవారం పోటీలు ముగిసే సమయానికి తెలంగాణ 25వ స్థానంలో నిలిచి.. తన ఖాతాలో 3 స్వర్ణాలు, 3 రజతాలు, 10 కాంస్యాలతో కలిపి 16 పతకాలు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలతో కలిపి 14 మెడల్స్ తో 18వ స్థానంలో నిలిచింది.

## స్పిరిట్' కాస్టింగ్ కాల్..

**బలగం టీవి, హైదరాబాద్**




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో 'స్పిరిట్' చిత్రాన్ని ఎప్పుడు మొదలు పెడతారని డార్లింగ్ ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ అప్డేట్ కోసం వేచి చూస్తున్న వారి కోసం చిత్ర బృందం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభాస్ సినిమాలో నటించే గోల్డెన్ ఛాన్స్ అందించబోతున్నట్లు తెలిపింది. ఈ మేరకు కాస్టింగ్ కాల్ ఇచ్చారు. ఏజ్ తో సంబంధం లేకుండా, ఆసక్తి ఉన్న అన్ని వయసుల వారికీ ప్రభాస్ సినిమాలో నటించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. అయితే ఫిలిం లేదా థియేటర్ బ్యాగ్రౌండ్ ఉన్న యాక్టర్స్‌ను మాత్రమే తీసుకోబోతున్నట్లు చెప్పారు. రెండు ఫోటోలను, 2 నిమిషాల ఇంట్రడక్షన్ వీడియోలను పంపించాలని అఫిషియల్ మెయిల్ ఐడీ ఇచ్చారు. ఇంట్రడక్షన్ వీడియోలో పేరు, ఎడ్యుకేషన్, అనుభవం వంటి వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు భద్రకాళి పిక్చర్స్ సంస్థ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. టీ–సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్స్ పై సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే హర్షవర్ధన్ రామేశ్వర్ తో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలుపెట్టారు. గతేడాది డిసెంబర్ లోనే షుఉటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత భూషణ్ కుమార్ చెప్పారు.




## కన్నప్ప సినిమాకు ప్రభాస్ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు

- మంచు విష్ణు

**బలగం టీవి, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అతిథి పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలో ప్రభాస్ రుద్రుడిగా కనిపించబోతున్నాడు. అయితే తాజాగా ఒక సినిమా ఇంటర్వ్యూలో భాగంగా విష్ణు మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం ప్రభాస్ ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని, తన తండ్రి మోహన్ బాబుపై ఉన్న గౌరవంతోనే ఈ సినిమా చేశాడంటూ చెప్పుకోచ్చాడు. మరోవైపు మలయాళ నటుడు మోహన్ లాల్ కూడా ఈ సినిమా కోసం ఎటువంటి రెమ్యునరేషన్ తీసుకోలేదని తెలిపాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ఛాంపియన్స్ ట్రోఫీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. ఫిబ్రవరి 14 నుంచి 17 తేదీల మధ్యలో ఈ వార్మప్ మ్యాచ్‌లు జరుగుతాయి. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్ మాత్రమే ఈ వార్మప్ మ్యాచ్‌లు ఆడుతున్నాయి. బిజీ షెడ్యూల్ దృష్ట్యా భారత్ వార్మప్ మ్యాచ్‌లు ఆడటం లేదు. ఇక ఈ వార్మప్ మ్యాచ్‌ల కోసం పాకిస్తాన్ మూడు టీమ్‌లను ప్రకటించింది. ఫిబ్రవరి 14న జరిగే మ్యాచ్‌లో షాదాబ్ ఖాన్ నేతృత్వంలోనే పాకిస్తాన్ షహీన్స్ ఆఫ్ఘనిస్తాన్‌ను ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్ లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో జరుగనుంది. ఫిబ్రవరి 16న జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్ కరాచీలోని నేషనల్ స్టేడియంలో జరుగుతుంది. ఫిబ్రవరి 17న కరాచీలో జరిగే మ్యాచ్‌లో ముహమ్మద్ హురైరా నేతృత్వంలోని పాకిస్తాన్ షాహీన్స్ సౌతాఫ్రికాతో తలపడుతుంది. అదే రోజు దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో మొహమ్మద్ హరీస్ సారథ్యంలోని పాకిస్తాన్ షాహీన్స్ న్యూజిలాండ్‌ను ఎదుర్కొంటుంది. ఈ నాలుగు వార్మప్ మ్యాచ్‌లు డే అండ్ నైట్ ఫార్మాట్‌లో జరుగుతాయి.

ఛాంపియన్స్ ట్రోఫీ అసలు మ్యాచ్‌లు ఫిబ్రవరి 19న మొదలవుతాయి. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరుగనుండగా.. మిగతా మ్యాచ్‌లన్నీ పాకిస్తాన్‌లో జరుగుతాయి. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు తలపడతాయి. ఫిబ్రవరి 20న జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. భారత్‌ను ఢీకొంటుంది. ఫిబ్రవరి 23న భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగతుంది. ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు గ్రూప్–ఏలో ఉండగా.. గ్రూప్–బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు పోటీపడుతున్నాయి.